క్లుప్తంగా

ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో రాణించాలి

బొమ్మలరామారం : ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో రాణించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రాగుల బల్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో క్రియాశీలకంగా మారి ప్రజాసేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గొడుగు చంద్రమౌళి, మామిళ్ల కృష్ణ, ఎలబొయిన రవి శంకర్, ప్యారారం రాములు,తాడెం అంజనేయులు, బాల్‌రాజ్, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బీబీనగర్: మండలంలోని రహీమ్‌ఖాన్‌గూడెం గ్రామంలో నిర్వహించిన శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవికుమార్, సత్యనారాయణ, ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు రాంరెడ్డి, కాటమయ్య, రామరావు, శంకర్ రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వలిగొండ : మండలకేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 1999 – 2000 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగాపురం సతీష్ గౌడ్, కాటం రాజ్, కర్ణాకర్, శ్యామ్లాల్, వేముల వెంకటేష్, రామలింగారెడ్డి, దేశి రెడ్డి వెంకట్ రెడ్డి,స్వాతి, మనీషా కల్పన ,విజయశాంతి, మోటే లింగ స్వామి, నరేందర్ రెడ్డి, గణేష్ పాల్గొన్నారు. అదే విధంగా ఆరూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరం పదో తగతి చదుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

బీబీనగర్: మండల కేంద్రంలోని బీబీనగర్ ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు పంజాల రామాంజనేయులుగౌడ్, గోళి పింగళిరెడ్డి, పట్టణ నాయకులు గోళి నరేందర్‌రెడ్డి, జాంగీర్, పంజాల వెంకటేశ్‌గౌడ్, అక్బర్, శ్రీనివాస్‌గౌడ్, పొట్ట నవీన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భీమిడి మోహన్ రెడ్డికి నివాళి

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం పట్టణ కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు భీమిడి మోహన్‌రెడ్డి 28వ వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వర్కాల వెంకటేశం సుంకరి జంగయ్య, గుమ్మడి అంజిరెడ్డి, మారగోని అశోక్, యాట వెంకటేశం, తడక కోటేశ్వర్, పోలోజు గోవిందాచారి, గోశిక పాండు, చిలువేరు రాజు, నూనె వెంకటేశం, గుర్రం నర్సింహ పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు.. దుర్గంధంతో పరుగు



రోడ్డుపై పారుతున్న మురుగు

ఆత్మకూరు(ఎం): మండల పరిధిలోని రాయిగిరి–మోత్కూరు మెయిన్ రోడ్డుపై మురుగు నీరు పారుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెంట మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో ప్రధాన రహదారిపై మురుగు నీరు పారి రోడ్డు పక్కనే నిల్వ ఉంటోంది. మురుగునీరు నిల్వ ఉంటుండటంతో దోమల ప్రభావం వల్ల ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మురుగునీరు రోడ్లపై పారకుండా.. నిల్వ ఉండకుండా చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మించారు.. పడావు పెట్టారు

- వంగపల్లిలో 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్న ఇళ్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం



కంపచెట్ల మధ్య ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో తాగిపడేసిన సీసాలు

యాదగిరిగుట్ట రూరల్: పేదల సొంతింటి కల కలగానే మారుతోంది. మండలంలోని వంగపల్లి గ్రామంలో గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించింది. గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను సైతం ఎంపిక చేశారు. లబ్ధిదారులను గుర్తించి రెండేళ్లు గడుస్తున్న వారికి ఇళ్లను కేటాయించడంలో ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వంగపల్లిలో గత ప్రభుత్వం 40ఇళ్లతో రెండు పడకల గదుల సముదాయాన్ని నిర్మించింది. రెండు సంవత్సరాల క్రితం గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామంలో అర్హులైన వారిని గుర్తించారు. కానీ నేటికీ వారికీ ఇళ్లు కేటాయించ లేదు. ఇళ్లు ఎప్పుడు అప్పగిస్తారో తెలియక లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. కాగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల చుట్టూ అడవిని తలపిస్తూ, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇళ్ల వద్దకు చేరుకోవడానికి సరైన మార్గం లేకుండా కంప చెట్లు పూర్తిగా కమ్మేశాయి. కొంతమంది దుండగులు ఇళ్ల అద్దాలు పగులగొట్టడంతో పాటు వైర్లు చోరీ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డబుల్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం



గత ప్రభుత్వం గ్రామంలో 40 బెడ్‌రూమ్‌లు నిర్మించింది. రెండేళ్ల క్రితం గ్రామ సభలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ ఇళ్లను మాత్రం అప్పగించలేదు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం. అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెల్లదీస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కేటాయించిన ఇళ్లను అప్పగించాలని కోరుతున్నాం.

– ఎండీ హబీబ్, వంగపల్లి

కాలయాపన చేస్తున్నారు



గ్రామంలోని రెండు పడకల ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులకు అందించకుండా కాలయాపన చేస్తున్నారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన ఇళ్లను ఇవ్వకపోవడంతో ఆ ఇళ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. సొంత ఇళ్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి లబ్ధిదారులుకు ఇళ్లు పంపిణీ చేయాలని కోరుతున్నాం.

– కొట్టూరు శంకర్, వంగపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



గత ప్రభుత్వ హయంలో మాకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరితగతిన అప్పగించాలని కోరుతున్నాం. సొంత ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్ల నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్న పంపిణీ చేయకపోవడంతో ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అప్పగించాలని కోరుతున్నాం.

–నమిలె రవి, వంగపల్లి

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ గంగా పార్వతీ సమేత బస్వలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవ యజ్ఞం, రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలను ధరింపజేసి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయకమిటీ చైర్మన్ ఏనుగు మహిపాల్‌రెడ్డి, ధర్మకర్తలు వనం లక్ష్మణ్, కర్నాటి పురుషోత్తం, సిద్దగోని మహేశ్, నోముల యాదిరెడ్డి, మైసగోని మహేశ్, చంద్రయ్య, కప్పల ప్రేమ్‌కుమార్, జయసూర్య, కళావతి, యాదయ్య, అర్చకులు శ్రీనివాస శర్మ, లక్ష్మీకాంత శర్మ పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం అందించాలి



జనంపల్లిలో ఎండిన వరిచేనును పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

రామన్నపేట : ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జనంపల్లి గ్రామంలో ఎండిన వరిపొలాలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వెల్లంకి, సిరిపురం, జనంపల్లి, బోగారం తదితర గ్రామాల్లో 800 ఎకరాల వరిచేన్లు ఎండిపోయాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎండిన వరి పొలాలను పరిశీలించి నష్టపరిహారం అంచనా వేయాలన్నారు. ఆయనవెంట నాయకులు బోయిని ఆనంద్, కందుల హన్మంత్, బల్గూరి అంజయ్య, గొరిగె సోములు, పండుగ రాజమల్లు, మేడి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రామన్నపేట : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కేతేపల్లి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ టి.మమత అన్నారు. స్థానిక వివేకానంద హైస్కూల్ ప్రీ ప్రైమరీ విభాగం వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వేడుకల్లో కరస్పాండెంట్ తిరుగుడు మల్లికార్జున్ ఉపాధ్యాయులు అస్మ, మల్లేశం, ముత్యాలు, నాగరాజు, జోసెఫ్, వెంకట్, నాగరాజు, సునీత, శాంతి, సుధారాణి, అనిత పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు

రామన్నపేట : తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఫోరం మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే చాంద్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలను మండల కేంద్రంలోని పోస్ట్‌బాక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యమకారుడికి ఇంటిస్థలంతో పాటు పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు ఆకవరపు మధుబాబు, సాల్వేరు అశోక్, గంగాపురం యాదయ్య నాయకులు నోముల శంకర్, బొడ్డుపల్లి లింగయ్య, ఇమామ్, కూనూరు శ్రీనివాస్, చొల్లేటి పాండురంగాచారి, బెడిద లింగస్వామి, ఆముద శ్రీను, కందుల నరసింహ, ఆంజనేయులు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై దాడులను అరికట్టాలి




మాట్లాడుతున్న ఏశాల అశోక్

భువనగిరి : చిరు వ్యాపారులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చిరు వ్యాపారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి రోజు స్వర్ణగిరికి వేలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో దేవాలయానికి వేళ్లే దారిలో ఉపాధి కోసం ఎంతో మంది స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు చిరు వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారన్నారు. చిరువ్యాపారులపరై దౌర్జన్యాలు చేస్తూ డబ్బులు వసూళ్లు చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్,అధ్యక్షులు దాసరి లలక్ష్మయ్య, చిరు వ్యాపారులు శంకరయ్య, కస్తూరి, లక్ష్మీ, పద్మచ అండాలు,అనసూయ, విజయ, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం

బీబీనగర్: మండలంలోని జైనపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తోటనిర్మల, విద్యా కమిటీ చైర్మన్ సునిత, ఉపాధ్యాయులు శ్రీదేవి, వెంకటేశ్వర్లు, అమృతం, యోగిత, స్వరూప, మాజీ స్సర్పంచ్ అంజయ్యగౌడ్, మధు గౌడ్ పాల్గొన్నారు.

అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న బాలరాజు

భువనగిరి : పట్టణంలోని మదర్ థెరిస్సా హైస్కూల్‌లో భారతీయ రాష్ట్రీయ సైక్లిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం అహల్యాబాయి త్రిశత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కసుప బాలరాజు మాట్లాడుతూ.. దేశంలో దేవాలయాల పునరుద్ధరణ కోసం పనిచేసిన వీర వనిత అహల్యాబాయి హోల్కర్ అన్నారు. ప్రతి ఒక్కరూ అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహాసంఘ్ ఇంచార్జి స్వప్న, నాయకులు క్రాంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు



మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి : పట్టణ కేంద్రంలో ఆదివారం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్, మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్,పట్టణకమిటి అధ్యక్షుడు రత్నపురం బలరాం, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలో భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌ను భువనగిరిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు మండల బిజెపి అధ్యక్షులు గూడె మధుసూదన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గుంటి సతీష్, పోచం సోమయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గుండాల : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. ఖానూరుబాబా డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు పట్టాలు పంపిణీ చేసి ఇళ్ల స్థలాలను ఇప్పటికీ అందజేయక పోవడం దారుణమన్నారు. ఆయన వెంట "నరేష్, హరికృష్ణ, అంబదాస్ ఉన్నారు.

పెచ్చులూడుతున్న ఎంపీడీఓ భవనం



పైకప్పు పెచ్చులూడిన ఎంపీడీఓ భవనం

యాదగిరిగుట్ట రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. కార్యాలయంలోని మొదటి అంతస్తులో సమీక్షా సమావేశాలు నిర్వహించే హాలుకు వెళ్లే దారిపైన స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడి పడుతుండడంతో అధికారులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా మీటింగ్ జరుగుతున్న సమయంలో ఈ స్లాబ్ పెచ్చులు ఊడి కిందపడే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. పెచ్చులూడుతున్న స్లాబ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు యథావిధిగా నిర్వహించాలి



భువనగిరి : సమావేశంలో మాట్లాడుతున్న పట్నం కపిల్

భువనగిరి : పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు యథావిధిగా నిర్వహించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ అన్నారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 6నుంచి జరగనున్న పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు మధ్యాహ్నం 12.15 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. మధ్యాహ్నం సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఎలా నిర్వహిస్తారన్నారు. రంజాన్ పేరుతో పరీక్షల వేళలను మార్చడం సమజసం కాదన్నారు. పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల రామస్వామి, ఉపాధ్యక్షుడు సదానందం, కార్యదర్శి అమరేందర్, కార్యవర్గ సభ్యులు మచ్చగిరి, సిద్దులు, మల్లీకార్జున్,రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షల సమయంలో మార్పు చేయాలి

ఆత్మకూరు(ఎం): పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల సమయాల్లో మార్పు చేయాలని బీజేవైఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమార స్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6 నుంచి నిర్వహించే పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలన ఆనరు. సమావేశంలో నాయకులు పైళ్ళ ప్రశాంత్, లోడి మహేష్, మధు, సాయి, నరేష్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : పదో తరగతి ప్రీ–ఫైనల్ పరీక్షా సమయాల్లో మార్పు చేయడం తగదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాధనబోయిన శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల పరీక్షల సమయాన్ని మధ్యాహ్నం నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. సమావేశంలో నాయకులు చిగుళ్ల బీరప్ప, మాయకోటి రాజు, కోయ ఉపేందర్, పులి జహంగీర్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నిర్వాహకులు

రాజాపేట : ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని శ్రీ సత్యసాయి సేవా సమితి రాష్ట్ర ఆధ్యాత్మిక విభాగం సమన్వయ కర్త వీఎస్ఆర్ మూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయిబాబా ప్రేమ నిలయం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్‌రావు, ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ ఏడుదొడ్ల శ్రీనివాస్, నల్లగొండ్ల జిల్లా అధ్యక్షుడు డీ శ్రీనివాస్, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా యూత్ కోఆర్డినేటర్ విజయ్, మహిళా కోఆర్డినేటర్ రమ్య, సమితి కన్వీనర్లు సత్యానారాయణ, కృష్ణ, రామచంద్రం, సత్యనారాయణ, వెంకటేశ్, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

వలిగొండ : తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ నుంచి అమరవీరుల స్థూపం వరకు నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిష్టాఫర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళ్లెం లక్ష్మారెడ్డి, శీలం స్వామి, గాజుల యాదగిరి, మారగోని శ్రీనివాస్, పబ్బు లక్ష్మయ్య, మల్లం వెంకటేష్, మంటి రమేష్, బంతిని రవీందర్,పిట్టల విజయలక్ష్మి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



ఆత్మకూరు(ఎం) : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు



రాజాపేట: ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు(ఎం):మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన చంద్రశేఖర్, మత్స్యగిరి కుటుంబాలను ఆదివారం 2011 పదవ తరగతి పూర్వ విద్యార్థులు పరామర్శించారు. రూ. 47వేల ఆర్థిక సాయం అందజేశారు. పోతిరెడ్డిపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన బండారు వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కేహెచ్ఆర్ ఫౌండేషన్ సహకారంతో మాజీ సర్పంచ్‌లు గనగాని మాధవి, నాగుల రాజులు ఆదివారం బాధిత కుటుంబాలకు రూ. 10వేల

రాజాపేట : మండల కేంద్రానికి చెందిన సట్టు కనకేష్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ. 50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

గుండాల : మండలంలోని అంబాల గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100ఆధ్యాత్మిక రచనలను ప్రజలకు వివరించారు. అనంతరం హోలీ పండుగపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర, శంకర్, లక్ష్మీనారాయణ, భాస్కర్, కోటి, మధుకర్, అశోక్, రామరాజు, సాయిరాజు, లత, జయమ్మ, రాణి, లలిత, కవిత పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు చేరేదెట్లా?

- బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయని దేవస్థానం
- భక్తుల ఇక్కట్లు, స్టేజీల వద్ద పడిగాపులు



బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు(ఎం) : యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులు రవాణాపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయకపోవడం, ఉన్నవి సకాలంలో రాకపోవడంతో ఉత్సవాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో గంటల తరబడి స్టేజీల వద్ద బస్సుల కోసం నిరీక్షణ తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రస్తుతం నడుస్తున్న బస్సులు ఇవీ..

మోత్కూరు, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు, అడ్డగూడూరు, గుండాల, తిరుమలగిరి రూట్లలో హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లోనే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి వెళ్తుంటాయి. ఈనెల 1నుంచి యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులు భారీగా స్వామి సన్నిధికి తరలివెళ్లుండడంతో సమస్య ఇంకా జఠిలమైంది. బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం తిరుమలగిరి, మోత్కూరు, ఆత్మకూరు(ఎం) నుంచి తొర్రూరు, సూర్యాపేట, మహబూబాద్, హైదరాబాద్–2, యాదగిరిగుట్ట డిపోలకు చెందిన 79 బస్సులు రోజులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల ఉప్పల్ డిపోకు చెందిన రెండు బస్సులు ఉప్పల్–మోత్కూరు షటల్ బస్సులుగా నడుస్తున్నాయి. ఇందులో యాదగిరిగుట్ట డిపోకు చెందిన 10 ఆర్డినరీ, 4 ఎక్స్‌ప్రెస్‌లు, పికెట్ డిపోకు చెందిన ఒక ఆర్డినరీ, సూర్యాపేట డిపోకు చెందిన రెండు ఎక్స్‌ప్రెస్‌లు, హైదరాబాద్ –2 డిపో ఏడు ఆర్డినరీ, మహబూబాద్ డిపో రెండు ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి.

కల్యాణానికైనా ప్రత్యేక బస్సులు నడుపుతారా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన స్వామి, అమ్మవారి తిరుకల్యాణం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు వేలాదిగా భక్తులు తరలివెళ్లే అవకాశం ఉంది కాబట్టి కల్యాణ మహోత్సవానికైనా ప్రత్యేక బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు.

ప్రత్యేక బస్సులు నడపాలి



ఆత్మకూరు(ఎం), మోత్కూరు ప్రాంతాలకు సమీపంలో యాదగిరిగుట్ట ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలోనే రెండవ తిరుపతిగా పేరుగాంచింది. బ్రహ్మోత్సవాలకు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో యాదగిరిగుట్ట డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడిపించాలి.

–కొరె బీరప్ప, ఆత్మకూరు(ఎం)

కల్యాణం రోజైనా నడపాలి



యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8న నిర్వహించే స్వామి వారి కల్యాణమహోత్సవానికి అయినా ప్రత్యేక బస్సులు నడిపించాలి. ఈ రూట్‌లో వచ్చే బస్సులన్నీ ఫుల్లుగా వెళ్తుంటాయి. కాబట్టి 8,9 తేదీల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి.

–యాస కవిత, ఆత్మకూరు(ఎం)

రాయగిరి నుంచి నడుపుతున్నాం

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. మిగతా ప్రాంతాల నుంచి నడపడానికి సరిపడా బస్సులు లేవు. మోత్కూరు నుంచి హైదరాబాద్ వైపు వచ్చే బస్సులే ఎక్కువ ఉన్నాయి. రాయగిరి వద్ద దిగినట్లయితే అక్కడి నుంచి యాదగిరిగుట్టకు బస్సు సౌకర్యం కల్పించాం.

–శ్రీనివాస్, యాదగిరిగుట్ట డిపో మేనేజర్